ఈ వారం కథ

# [illegible]

**-రాణి శివశంకర్**

నేను సినిమా టికెట్ దొరక్కపోవడంవల్ల మేనకా హోటల్‌కి నెళ్ళి కవులు కథకుల మధ్య జేరాను. సిగిరెట్ ధూపంలోంచి కవికుల గురువు అవార్డెడ్ విప్లవ కవి లోకమిత్ర ముఖం బయటపడి కవిత్వం పొగలా మమ్మల్ని కమ్మేసింది. “పొగంటే పొగ కాదు. పొగంటే నీ హృదయంలోని సెగ శత్రువుపై పగ వ్యవస్థపై పగ ప్రథమ పాదే జంబూద్వీపే భరత వర్షే భరతఖండే భారద్వాజస గోత్రుణ్ణే యీ వ్యవస్థకి తిలోదకాలిచ్చి పిండప్రదానం చేస్తాను” వెంటనే నేను అందుకున్నాను “శ్రాద్ధం మంత్రాలు చదువుతాను” అని.

లోకమిత్ర నా వైపు తిరిగి “మీరూ కవిత్వంలో కాలుపెట్టినట్లున్నారు”

“అంతా మీ ఆశీర్వాదం. మీ కవిత్వం నిండా భారతీయ సంస్కృతి. క్షత్రియ బ్రాహ్మణ అంశలు కలిసి ముచ్చట కొలువుతున్నాయి. ఆధునిక కవిత్వంలో మీరు జందాల పున్నమి. ఇంతకీ మీరు హోమాలు చేస్తారా?”

“లేదు. విప్లవ హోమాలు చేస్తాను. అభ్యుదయ అర్ఘ్యాలు ఇస్తాను.”

ఇంతలో హలో బ్రదర్ అంటూ అచ్చం ఆ కవికే జిరాక్సు కాపీ. కుర్చీలు ఖాళీ లేక లోకమిత్ర సగం చోటిచ్చాడు.

“సార్ మీరు చదవమన్న పుస్తకం చదివా. అద్భుతంగా అచ్చంగా మీ కవిత్వం లాగే వుంది” ఆశ్చర్యం గొంతు కూడా ప్రతిధ్వనే.

“అసలు యువ కవుల కోసం వొక సిలబస్ తయారు చేస్తున్నా” అన్నాడు లోకమిత్ర.

“కవిత్వం గిలకడానికి పుస్తకాలు చదవాలా సార్” అడిగాను.

“పుస్తకాలు కూడా కవులని ప్రభావితం చేస్తాయి”

నా కవిత్వ కండూతికి కారణం పుస్తకాలు కాదు సార్, దుశ్శాలువా. కవిత్వం కథ విమర్శ యిలా అన్ని పందాల్లో ఛాంపియన్ అయినందుకు సర్వజ్ఞరావుగార్ని ప్రముఖ విద్యా వ్యాపారి వొకాయన సన్మానించినపుడు, ఆ దుశ్శాలువా చమక్కులు కెమెరాల క్లిక్కులు కెక్కెక్కించి నాకు కవిత్వం దురద మొదలైంది”.

“ఐతే నీకు కవిత్వమంటే ప్రాణమన్నమాట”

“ఈ మధ్య షేర్ మార్కెట్లో బుల్ కుర్రబొడిచాక కవిత్వం తన్నుకొస్తోందండీ”

“అవును యీ క్షుద్ర పెట్టుబడిదారీ వ్యవస్థలో మనిషి విసిగి వేసారి కవిగా మారుతాడు. మరో వ్యవస్థకి కవిత్వాన్ని పెట్టుబడిగా మారుస్తాడు.”

“మన్మోహన్‌సింగ్ ఫిలాసఫీలో మన ప్రోగ్రెస్వ్ పోయెట్ ప్రోగ్రెస్, వరల్డ్ ప్రోగ్రెస్. నా కోసమే కవిత్వాన్ని పెట్టుబడిగా మార్చుకోవాలనుందండీ.”

“కావచ్చు. అది విప్లవ పంథా అని కమ్యూనిస్టుల్ని ఒప్పించడం కష్టం.”

“సార్ అదంతా నా కనవసరం. నాకు అర్జెంటుగా అవార్డు కావాలి. కవితలాయాలా కథలాయాలా విమర్శ రాయాలా అన్నీ కలిపి కొట్టాలా విప్లవ కవిత్వమా హైకూలా పరాయీకరణ పలవరింపులా ఏది దారి మహాశయా.”

“మీరు ప్రజల గురించి కవిత్వం రాస్తే, యీ వ్యవస్థపై తిరుగుబాటు ప్రకటిస్తే గుర్తింపూ అవార్డులూ అవే వస్తాయి. నామ్ రాలేదూ?”

“ఇంతకీ మీదేటైపు విప్లవం సార్ హరిత విప్లవమా నీలి విప్లవమా అవార్డు విప్లవమా రివార్డు విప్లవమా రూపాయల విప్లవమా డాలర్ల విప్లవమా?”

అవార్డు కథకుడు అడ్డుపడ్డాడు “ఈ విప్లవం గిప్లవం నా వొంటికి పడదండీ. గాంధీ పుట్టిన దేశంలో రక్తపాతం మంచిది కాదని యాంగ్రీ యంగ్‌మెన్ తెలుసుకోవాలి. ప్రేమ, ఆత్మీయత, ఆప్యాయత కథల్లో పుట్టిపడాలి.”

“మరి ప్రభుత్వమూ పోలీసులూ ఎన్‌కౌంటర్ల పేరుతో...”

“అది వాళ్ళ ఉద్యోగ ధర్మం. కవులు శవాల్ని రక్తాన్ని బీభత్సాన్ని చూసి చూడనట్టు తప్పించుకొని తిరగాలి. కథలూ కవిత్వమూ కన్నీరూ పన్నీరూ చిలకరించినట్టుండాలి”

చివరికి లోకమిత్ర అవార్డు కథకుడి కథల్ని మెచ్చుకున్నాడు. కవిత్వంలో విప్లవం మరీ ఘాటుగా లేనందుకు మానవతావాదం చిరుగాలిలా సోకుతున్నందుకు అవార్డు కవి కథకులు మందూ సోడాల్లా కలిసిపోయారు.

ఇంతలో పరాయి కవి “ఎక్కడ, నేనెక్కడ, ఎలా ఎందువలన తప్పిపోయాను?”

“మీరెక్కడే- ఎందుకంత ఆందోళన?”

“నా నుంచి నేనే వేరైపోయాను. ముక్కలు ముక్కలై చెల్లాచెదురైపోయాను. మనిషి ఏడి ఎక్కడ?”

“ఏ మనిషి?”

“మనిషండీ మనిషి. అసలైన మానవత్వం వున్న మనిషి తప్పిపోయాడు వెతకాలి” గొణుక్కుంటూ వెల్తుర్లోనే టార్చి ఫోకస్ చేస్తూ, పరాయీకరణం కవి వెళ్ళిపోయాడు తడుముకొంటూ. ఏం మనిషో ఏం లోకమో?

వేరుకొనేంతలో వొక పురి టేబుల్‌పై. నేను కెవ్వున అరిచాను. “భయపడకు మిత్రమా. అంతా పసిఫిక్ త్రిల్. నా మిగిలిన అవయవాలు “పోరటికొకటి” చొప్పున, హజరౌతాయి. కళ్ళు నీలి చిత్రం చూస్తున్నాయి. మెదడు గుండె చెత్త బుట్టలో భద్రం. నా ముక్కు సెక్స్ శ్లేష్మాన్ని ప్రేమగా తుమ్ముతోంది. కాళ్ళు వెనక్కి పోయి పోగు చరిత్రని బంతిలా తంతున్నాయి. ఇంటర్వ్యూలు వెనక నుంచే. పురి సీరియల్ సీరియల్‌గా జడుసుకోవడంలోని ఆనందాన్ని రుచి చూపిస్తోంది. ఐయామ్ హేపీ.”

“అసలు మీరు మరణించారా జీవించే వున్నారా? మీ చావు సశేషమా సంపూర్ణమా? ఏ వారం క్లైమాక్స్? ఇంతకీ జరపాల్సింది సన్మాన సభా? సంతాప సభా?”

“మరణం ఏది జీవితం ఏది ప్రియా నీవే నా జీవితం”

“పురిలోంచి ప్రేమ కవిత్వం ఓహ్ యీ కవితతో నా పత్రికని సింగారిస్తా. పూర్తి చేయండి.”

“మిగతా వచ్చే వారం” అని పురి ఎగిరిపోయింది, కలం దెయ్యం (ఘోస్ట్ రైటర్)తోపాటు.

ఇంతలో సర్వజ్ఞరావుగారి ప్రవేశం.

“నక్కను తొక్కాను సార్. వస్తువు దొరికిందండీ వస్తువు”

“బంగారమా వెండా?”

“బంగారంలాంటి కవితా వస్తువండీ. గుడ్డి బిచ్చగాడు. ఇంతవరకూ అందరూ వట్టి బిచ్చగాడిగురించే రాశారు. నేను స్పెషలైజ్ చేసి రాస్తాను. గుడ్డి కుంటి చెవుడు వగైరా బిచ్చగాళ్ళ గురించి కన్నీరు మున్నీరయ్యేలా...”

“చెప్పండి యిప్పుడే వేసిన స్పెషల్ దోసె లాంటి మీ కవిత.”

“సూర్యోదయం లేని ఆ గుడ్డి బిచ్చగాడిని చూస్తుంటే కళ్ళు పొడిచేసుకోవాలనిపిస్తుంది. కాని కళ్ళల్లో తడి”



విమర్శకుడు అందుకున్నాడు “ఈ కవితలో పొడి తడి పదాల ప్రయోగం గురించి భాషా శాస్త్రరీత్యా పరిశీలించాలి. ఇక్కడ ప్రాస కూడా గొప్ప అందం. భావ కవులు ముత్యాల సరాల్లో యిలాంటి ప్రాసని ఉపయోగించేవారు. వచ్చేవారం చూస్కోండి”

నేను అన్నాను “కవిగారూ యిలా యే వస్తువు దొరుకుతుందా అని పొంచివుండి నీటాడ్డాన్ని వస్తు లొల్లాం అనే జబ్బుగా నిర్ధారించారు, వొక సాహిత్య సైకోథెరపిస్టు.”

“ఆయనకేం తెల్సు? యీయన కవిత్వం కథ విమర్శ యిలా అన్ని రంగాల్లో అడుగుపెట్టిన అన్ని స్టేజీలపై కాలుపెట్టిన ఉద్దండుడు, పుస్తక ప్రచురణలో ప్రచండుడు”

“సరే కానీ యక్షగానాలూ హరికథలూ...”

“వాటి సంగతి కూడా చూస్తా” సర్వజ్ఞరావు.

వొక పెద్ద మనిషిని ప్రవాసాంధ్ర పత్రికా సంపాదకుడిగా పరిచయం చేశారు.

“ఆ పత్రిక ఎక్కడా చూళ్ళేదే?” నా సందేహం.

“ప్రవాసాంధ్రుల సాహిత్య తృప్తి కోసం భావప్రాప్తి కోసం పెట్టిన పత్రిక. ఫారిన్ ఎక్స్‌పోర్టేషన్ ఎక్కువ. సాహిత్యాన్ని కూడా విదేశీ మారక ద్రవ్యం సంపాదించడానికి ఉపయోగించి దేశ సేవ చేస్తున్నాం. ప్రవాసాంధ్రుల రచనలకే ప్రాధాన్యం.”

“తెలుగు కలాలకి స్థానం లేదా?”

“ఎందుకు లేదు? ఫారిన్ టెలుగూస్‌కి నచ్చాలి”

“మరి విప్లవ కవిత్వం?”

“విప్లవ కవిత్వమైనా అభ్యుదయ కవిత్వమైనా ఆవకాయ కవిత్వమైనా లోకమిత్రగారి కవిత్వంలా రొయ్య వేపుళ్ళా రుచించాలి కాని, మామూలు చేప కూరలా, ముళ్ళు అడ్డం పడకూడదు.”

“దళిత వాదం?”

“ఏం దళిత వాదం?” ఒక్కసారి విరుచుకు పడ్డాడు సర్వజ్ఞరావు “కవి కుల మతాలకి అతీతుడు. అతని హృదయం ఆకాశం.”

“ఆకాశయానం అలగా జనానికి సాధ్యం కాదనుకోండి”

“మరి మన సాహిత్యానికి అంతర్జాతీయ ఖ్యాతి రావాలి కదా? డాలర్లలో చెలామణీ కావాలి కదా సర్వజ్ఞరావు.”

ఇంతలో కుంభకర్ణుడి తమ్ముడు “ఈ వాదాలన్నీ మాకెప్పుడో తెలుసు. వర్గాలు పోవాలి ముందు. విప్లవం విజయవంతమయ్యాక నిద్ర లేపండి” అని గురక మొదలుపెట్టాడు.

లోకువ కవి అన్నాడు “అసలు కవి వాదాలకే కాదు అనుభూతికి కూడా కట్టుబడకూడదు. ఉన్నదున్నట్లు చూసింది చూసినట్లు దించెయ్యాలి. నా లోకూలు చూశారా?”

“లోకూలంటే?”

“పిట్ట చెట్టుపైన, రెట్ట నెత్తిపైన, ఇదే లోకూ, హైకూ బామ్మరిది.”

“ఎంత నేచురల్‌గా వుంది! ఈ కవిత్వం ఏ దేశం నుంచి దిగుమతైంది?”

“అంటార్కిటికా నుంచి”

“అక్కడ మనుషులుండరు కదా?”

“కవులకేం కొదవ?”

నప్పుడిగారప్పుడు నీదే వాదమని. “అవకాశవాదం” నా సమాధానం అందరికీ గుచ్చుకుంది.

అందరూ దూరంగా జారిపోయే యీ కవి సమయంలోకి... కొంగొత్తగా సాహసికుడు...అజూబా... ప్రశ్నని ఎక్కుపెట్టి “ఎవరి ఆస్థాన కవులు మీరు?”

“ఇది మధ్య యుగం కాదు” కోపంగా లోకమిత్ర.

“ఈ సమాధానం మీరు సోషల్ పాఠాలు చదువుకున్నారన్న సంగతిని తప్ప దేన్నీ తెలియచెయ్యదు. ప్రబంధ కవులు, నగరాలు, నాయికలు, రుతువులు వగైరా వర్ణనలు చమత్కారాల తళుక్కుల్లో అలంకారాల్లో మెరిపించినట్లుగా మీరు కొంగొత్త వస్తువుల వెనక దాక్కొని కాలక్షేపం చేస్తారు. ముక్కూ మొహం, దేశకాల నిర్దిష్టత లేని మానవతావాదంతో వెళ్ళబుచ్చుతారు. ప్రదర్శనశాలల్లో నవాబుల కత్తుల్లా విప్లవాన్ని కూడా ప్రదర్శన వస్తువుగా మార్చేస్తారు. కులాలకీ మతాలకీ అన్నిటికీ అతీతంగా వెలిగిపోతున్నట్లు ఫోజిస్తారు. యూనివర్సిటీలూ, అకాడమీలూ మీ చలివేంద్రాలు. అవార్డు మీ కొనమేరువు. గోనె సంచిలో కట్టి నీళ్ళల్లో పడేసిన దళితుడి శవం వాసన మీ ముక్కు పుటాల్ని సోకదు. భూమండలాన్ని ప్రశ్నార్థకం గుర్తు ముందుకు నెట్టాలన్నాడో కవి. మీకు ప్రశ్నలేవు సందేహాలేవు వున్నట్లు నటిస్తారంతే. “వాళ్ళ గుర్తించడం మానుకో” అన్న దళిత గర్జన మీ చెవుల్ని సోకదు. హాయిగా నిద్రపోండి. గుడ్ బై”

“విమర్శ మరీ అంత క్రూరంగా వుండకూడదు” లోకమిత్ర.

ఆశ్చర్యం. అధివాస్తవిక విరోధీ వేణూ! నిరుడంగా టీ కప్పులు టేబుల్ మీద లేవు. శూన్యంలో వేళ్ళాడ్తూ “దిగిరాం దిగిరాం మీ గాలి సోకితే మా వేడీ పొంగా చల్లారిపోతుంది.”